క్లుప్తంగా

మల్లన్నకు సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను నిర్వహించింది. ముందుగా ఆలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్చరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఆశీనులను చేసి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

పంచమఠాలలో విశేష పూజలు



పంచమఠాలలోని స్వామివారికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో లోకకల్యాణార్థం పంచమఠాలలో విశేషంగా అభిషేకం, పుష్పార్చనలు జరిపించారు. సోమవారం ఉదయం భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధర మఠాలలో పూజాదికాలు జరిపించారు. ముందుగా అర్చకులు సంకల్పాన్ని పఠించారు. అనంతరం ఘంటామఠంలోని గణపతికి పూజాదికాలు జరిపారు. అనంతరం అన్ని మఠాలలో సంప్రదాయబద్ధంగా అభిషేకాది అర్చనలను నిర్వహించారు. పూజా కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, ఏఈఓ హరిదాసు తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాదానికి విరాళాలు



దాత కుమారస్వామిరెడ్డిని సత్కరిస్తున్న ఏఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు పలువురు భక్తులు విరాళాలు అందించారు. సోమవారం హైదరాబాద్‌కు చెందిన ఎ.కుమారస్వామిరెడ్డి రూ.1,00,116 విరాళాన్ని ఏఈఓ జి.స్వాములుకు అందించారు. అలాగే కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాకు చెందిన అమిత్‌కుమార్ మన్నూర్ రూ.లక్ష విరాళాన్ని పర్యవేక్షకురాలు పి.దేవికకు అందజేశారు. దాతలను దేవస్థానం తరపున స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

పాములపాడు: గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆదేశించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున పారిశుద్ధ్య లోపించే అవకాశం ఉందన్నారు. ఈగలు, దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. డయేరియా గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.

మొక్కలు నాటిన ఈఓ



విభూతి మఠం వద్ద మొక్క నాటుతున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: పర్యావరణ పరిరక్షణకు, శ్రీశైల క్షేత్రాన్ని మరింతగా సుందరీకరించేందుకు శ్రీశైల క్షేత్ర పరిధిలో పలుచోట్ల మొక్కలను నాటే కార్యక్రమం చేపట్టారు. సోమవారం క్షేత్ర పరిధిలోని విభూతిమఠం ప్రాంగణంలో శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు ఉసిరి, జమ్మి, పొగడ, కదంబం, తెల్లమద్ది మొక్కలను నాటారు. ఈ సందర్భంగాఈఓ మాట్లాడుతూ నాటిన మొక్కల సంరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉద్యానవన అధికారులను ఆదేశించారు. పంచమఠాల వద్ద మరింత ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పించేందుకు దేవతా మొక్కల పెంపకం ఎంతో దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ఎం.హరిదాసు, అర్చకులు, ఉద్యానవన అధికారులు లోకేష్, ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కోలుకోలేక మహిళ మృతి

నందికొట్కూరు: ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అల్లూరు గ్రామానికి చెందిన వేదావతి(38) కోలుకోలేక సోమవారం మృతిచెందింది. ఏఎస్ఐ మేరి తెలిపిన వివరాలు.. భర్త చెన్నయ్య లష్కర్ ఉద్యోగం చేస్తూ అనారోగ్యంతో కొంతకాలం క్రితం మృతి చెందగా.. భర్త ఉద్యోగం మేరికి ఇచ్చారు. జీవితంపై విరక్తి చెందిన మేరి ఆదివారం ఇంట్లోనే గడ్డి మందు తాగింది. కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందింది. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

రూ.లక్షలు వెచ్చించినా.. నెరవేరని లక్ష్యం..!

- రూ. 5 లక్షల వ్యయంతో ట్యాంక్ నిర్మాణం
- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయని అధికారులు
- తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్తులు



ట్రాన్స్‌ఫార్మర్ అమర్చకపోవడంతో నిరుపయోగంగా ఉన్న తాగునీటి బోర్ మోటార్



జలజీవన్ మిషన్ నిధులతో నిర్మించిన అర్లపాడు ఓవర్‌హెడ్ ట్యాంక్

పగిడ్యాల: ఇంటింటికి స్వచ్ఛమైన రక్షిత మంచి నీటిని సరఫరా చేసేందుకు గత ప్రభుత్వం జలజీవన్ మిషన్ పథకం కింద లక్షలాది రూపాయలు మంజూరు చేసి నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్ నిరుపయోగంగా ఉంది. రూ.లక్షలు వెచ్చించినా లక్ష్యం నెరవేరకపోవడంతో కొత్తకొండ ప్రాగటూరు, అర్లపాడు గ్రామస్తులకు శాపమైంది. వెరసి ఆయా గ్రామాల ప్రజలు నిత్యం తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రూ.5.70 లక్షలు జమ చేసినా..

జలజీవన్ మిషన్ పథకం కింద గత ప్రభుత్వం 40 వేల లీటర్ల సామర్థ్యంతో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్ దిష్టిబొమ్మలా మారింది. దాదాపు ఏడాది కాలంగా ట్యాంక్ నిరుపయోగంగా ఉండటంతో అర్లపాడు, కొత్తకొండ ప్రాగటూరు ప్రజలు ఎదుర్కొంటున్న కన్నీటి బాధలు వర్ణానాతీతం. నీటి సరఫరా చేసేందుకు అవసరమైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు రూ.5.70 లక్షలు విద్యుత్ శాఖకు జమ చేసినా ఇప్పటి వరకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయకపోవడం శోచనీయం. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రెండు గ్రామాల ప్రజలు గొంతెండి అల్లాడిపోతున్నారు. ప్రజల దాహార్తిని తీర్చడానికి నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్ గ్రామ ముఖ ద్వారంలోనే దిష్టిబొమ్మలా మిగిలిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు నిధులు జమ చేసిన ఆ శాఖ అధికారులు నిమ్మకునీరేత్తినట్లుగా వ్యవహరించడంపై గ్రామస్తులు ఆగ్రహావేశాలను వ్యక్తం చేస్తున్నారు. దేవుడు కరుణిస్తే పూజారి కరుణించడం లేదన్న చందంగా గత ప్రభుత్వం జలజీవన్ మిషన్ కింద రూ. 15 లక్షలు మంజూరు చేసి ట్యాంక్ నిర్మాణం పూర్తి చేయిస్తే విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ అమర్చకుండా నిర్లక్ష్యం వహిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ అధికారులు తక్షణమే స్పందించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు నీటి సరఫరాను కొనసాగించి ప్రజల దాహార్తిని తీర్చాలని కోరుతున్నారు.

త్వరలోనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయిస్తాం

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అవసరమైన మెటీరియల్ అందుబాటులో లేదు. సమ్మర్ ముగిసింది కదా ట్రాన్స్‌ఫార్మర్‌కు అవసరమైన మెటీరియల్ వచ్చిన వెంటనే అమర్చి సమస్యను పరిష్కారిస్తాం.

– శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఏడీ, నందికొట్కూరు

సాగునీరు విడుదల చేయాలి

కొత్తపల్లి: మండలంలోని గ్రామ శివారులో ఉన్న శివపురం, సంగమేశ్వరం ఎత్తిపోతల పథకాల ద్వారా పొలాలకు సాగునీరు విడుదల చేసి పంటలను కాపాడాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్ స్వాములు, నాయకులు ఎస్ సంజీవరాయుడు డిమాండ్ చేశారు. సోమవారం సింగరాజు పల్లె గ్రామంలో వారు మాట్లాడుతూ ముందస్తుగా కురిసిన వర్షాలకు మొక్కజొన్న పంటను రైతులు సాగు చేశారన్నారు. జూన్‌లో సరైన వర్షాలు లేక పైర్లు ఎండిపోతున్నాయన్నారు. కృష్ణానది ఎగువ నుంచి ముందుగానే నీళ్లు వచ్చి శ్రీశైలం ప్రాజెక్టు 865 పైగా నీరు చేరిందన్నారు. ముసలమడుగు వద్ద ఉన్న ఎత్తిపోతల పథకాల పంప్ హౌస్‌కు నీళ్లుపుష్కలంగా అందుతున్నా ఇరిగేషన్ అధికారులు సాగునీరు ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. ఎత్తిపోతల పథకాల ద్వారా శివపురం, సింగరాజుపల్లి, చిన్న గుమ్మడాపురం, పెద్ద గుమ్మడాపురం, ముసలిమడుగు, ఎర్రమఠం గ్రామాల్లో రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటను కాపాడాలని కోరారు. సాగునీరు విడుదల చేయకపోతే రైతులతో కలిసి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

ఖైదీలకు న్యాయవాదులను నియమిస్తాం

నందికొట్కూరు: న్యాయవాదిని నియమించుకోవడానికి ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు కోర్టు న్యాయవాదులను ఉచితంగా నియమిస్తామని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు ఎ.శోభరాణి తెలిపారు. సోమవారం పట్టణంలోని సబ్‌జైల్‌ను జడ్జి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సబ్‌జైల్‌లో సమస్యలుంటే న్యాయవాదుల దృష్టికి, ఆన్‌లైన్ నెంబరు 15100 ద్వారా కంప్లయింట్ చేయాలన్నారు. అనంతరం భోజన వసతుల గురించి ముద్దాయిలను అడిగి తెలుసుకున్నారు. వైద్య సదుపాయాల గురించి ఆమె ఆరా తీశారు.

శేషజీవితం సాఫీగా సాగాలి



శ్రీనాథ్ దంపతులను సన్మానిస్తున్న డిప్యూటీ ఈఓ, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు, తదితరులు



ఎంఈఓ-2ను సన్మానిస్తున్న ఉపాధ్యాయినులు

నందికొట్కూరు: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సర్వసాధారణమని, శేష జీవితం సాఫీగా సాగించాలని డిప్యూటీ ఈఓ శంకర్‌ప్రసాద్, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు సూచించారు. మిడుతూరు ఎంఈఓ-2 శ్రీనాథ్ పదవీ విరమణ సభ సోమవారం మిడుతూరు ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనాథ్ సేవలను పలువురు కొనియాడారు. అనంతరం శ్రీనాథ్ దంపతులను పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ దశరథరామయ్య, ఎంఈఓ ఫైజున్నీసాబేగం, పాణ్యం ఎంఈఓ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి



నాగభూషణంశెట్టిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆత్మకూరు: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని తహసీల్దార్ రత్నరాధిక, సీఐ రాము, ఏఓ హేమలత, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, మండల ఎంపీపీ తిరుపాలమ్మ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ నాగభూషణంశెట్టి పదవీ విరమణ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు.

ఘనంగా వీడ్కోలు



విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న డీడీ సాయిబాబా

ఆత్మకూరురూరల్: పదవీ విరమణ పొందిన ఎఫ్ఎస్ ఓ పిక్కిలి శ్రీనివాసులు, కార్యాలయ సహాయకురాలు సుబ్బమ్మలను సోమవారం డీడీ కార్యాలయంలో సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ వి సాయిబాబా, వెలుగోడు ఎఫ్ఆర్ఓ ఖాన్, సూపరింటెండెంట్‌లు దివాకర్, రాజశేఖరరాజు పాల్గొన్నారు.

● **పాములపాడు:** స్థానిక పోస్ట్ ఆఫీస్ డాకు సేవా ఉద్యోగి కలబండి మనోహర్ పదవీ విరమణ సందర్భంగా ఆయనను సోమవారం సర్పంచ్ మేకల భాగ్యమ్మ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పోస్ట్‌మాస్టర్లు మనోజ్ కుమార్, ఖాజా, మహబూబ్, మరిరెడ్డి పాల్గొన్నారు.

● **వెలుగోడు:** రేగడగూడూరు జెడ్పీ హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్ ముల్లా అబ్దుల్‌రబ్ పదవీ విరమణ సందర్భంగా సోమవారం హెచ్ఎం మహ్మద్ షఫీతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. అబ్దుల్‌రబ్ సేవలను కొనియాడారు.



అబ్దుల్‌రబ్‌ను సన్మానిస్తున్న దశ్యం

● **బండిఆత్మకూరు:** ఎంపీడీఓ ఎం.దస్తగిరి పదవీ విరమణ సందర్భంగా ఆయనను అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, తహసీల్దార్ పద్మావతి, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లాలి స్వామి పాల్గొన్నారు. అలాగే ఎర్రగుంట్ల వీఆర్వో వెంకటేశ్వర్లు, బండి ఆత్మకూరు వీఆర్వో యేసు పాదం పదవీ విరమణ పొందడంతో వీరిని కూడా మండల రెవెన్యూ అధికారులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.



దస్తగిరిని సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు,అధికారులు

● **శ్రీశైలం టెంపుల్:** శ్రీశైల దేవస్థానంలో సోమవారం పలువురు ఉద్యోగులు పదవీ విరమణ చేశారు. భ్రమరాంబా దేవి ఆలయ ప్రధాన అర్చకులు మార్కండేయ శాస్త్రి, రికార్డు అసిస్టెంట్ కే.కృష్ణారావు, హెల్పర్ పి.వి. రమణ, స్వీపర్ జె. మరియమ్మ పదవీ విరమణ పొందడంతో దేవస్థాన అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

బండి ఆత్మకూరు: సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ జగన్మోహన్ సూచించారు. సోమవారం సాయంత్రం పరమాటూరు గ్రామ ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచితుల నుంచి వచ్చే మొబైల్ నెంబర్లకు బదులు ఇవ్వవద్దని, మొబైల్‌లో ఎలాంటి బెట్టింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దని, వాటిని సోషల్ మీడియా ద్వారా ఇతరులకు షేర్ చేయవద్దని సూచించారు. సోషల్ మీడియాలో ప్రలోభ పెట్టే యాప్‌ల జోలికి వెళ్లవద్దని, అనుమానిత యాప్‌లపై వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

మహానందీశ్వరుడికి పల్లకీసేవ

మహానంది: మహానందీశ్వర దంపతులకు సోమవారం రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, సూపరింటెండెంట్ ఎం.నీలకంఠ రాజు ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు అలంకార మండపంలో మహానందీశ్వర స్వామి ఉత్సవ మూర్తులను అలంకరించారు. గణపతి పూజ చేసి, అలంకార హారతులు ఇచ్చి స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారాల్లో ఉత్సవం కనుల పండువగా నిర్వహించారు. ధ్వజస్తంభం వద్ద హారతులు ఇచ్చి పూజలు నిర్వహించి ఉత్సవ మూర్తులను యాగశాల వద్దకు చేర్చారు.

సమ్మెను విజయవంతం చేయాలి

ఆత్మకూరు: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని జూలై 9న చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, పెద్దనాగరాజు కోరారు.

మత్స్యశాఖ భూములను కాపాడాలి

జూపాడుబంగ్లా: 35 బొల్లవరం రెవెన్యూ పరిధిలో మత్స్యశాఖకు కేటాయించిన భూములను సర్వే చేయించి సరిహద్దులు ఏర్పాటుచేయించి ఆక్రమణదారుల నుంచి కాపాడాలని సీపీఐ (లిబరేషన్) జిల్లా ఉపాధ్యక్షుడు పిక్కిలి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు వేల్పుల ఏసన్న, నరసింహులు, సోమప్ప, స్వాములు, బీబీ, పిక్కిలి శివకుమార్, లక్ష్మీదేవి, చెంచమ్మ, దస్తగిరి, సునీత, మహేశ్వరి, పార్వతమ్మ, అరీఫ్, సుల్తాన్, దినేష్‌రెడ్డి, లవకుమార్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో వీఆర్ఏ మృతి

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని ఈర్నపాడు గ్రామ రెవెన్యూ సహాయకుడు లింగన్న (70) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ కొంతకాలంగా నంద్యాలలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లింగన్న కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య లక్ష్మీదేవి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న మండల రెవెన్యూ సిబ్బంది లింగన్న మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● **శుభకార్యం**



ఆత్మకూరు: మండలంలోని సిద్ధపల్లె డెయిరీ కాంప్లెక్స్‌లో మురహరి శ్రీను సోదరుడు విజయ్‌కుమార్ వివాహ మహోత్సవంలో వైఎస్సార్‌సీపీ శ్రీశైలం ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

దుకాణాల తనిఖీ



మందుల దుకాణంల తనిఖీ చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండల కేంద్రంలోని పుష్కర, రాజరాజేశ్వరి, మన గ్రోమోర్ ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి అమిరున్నిసా బేగం సోమవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. కొనుగోలు చేసిన ప్రతి రైతుకు బిల్ ఇచ్చి సంతకాలు తీసుకోవాలని యజమానులకు సూచించారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్ పుస్తకాలు తప్పకుండా అప్డేట్ చేసుకోవాలన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు మాత్రమే ఇవ్వాలని, అనవసరమైన ఎరువులను అంటగట్టరాదని సూచించారు. అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. తనిఖీలో వ్యవసాయ విస్తరణ అధికారి నాగశ్రీ పాల్గొన్నారు.

కొలువుదీరిన పీర్లు



జూపాడుబంగ్లా: మొహరం సందర్భంగా తాటిపాడు, 80బన్నూరు, తంగడంచ, జూపాడుబంగ్లా,మండ్లెం, పారుమంచాల తదితర గ్రామాల్లో పీర్లదేవుళ్ల చావిడిలలో సోమవారం కొ లువుదీరాయి. జూలై 4న చిన్నసరిగెత్తు, 5న పగలు సరిగెత్తు, 6న పెద్దసరిగెత్తు నిర్వహించి 7న పీర్లను ఏటికి సాగనంపనున్నట్లు ముస్లిం మతపెద్దలు తెలిపారు.

ఆందోళనకు సిద్ధం కావాలి

నందికొట్కూరు: సమస్యల పరిష్కారం కోసం ఆందోళనకు సిద్ధం కావాలని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు సూచించారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు నివాసం ఉంటున్న ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు ఫక్కీర్‌సాహెబ్, గోపాలకృష్ణ, మద్దిలేటి,రంగమ్మ, హుసేనమ్మ,ఓబులేసు, రామకృష్ణ, రాము, మధు పాల్గొన్నారు.

సంగమేశ్వరంలో భక్తుల సందడి



ఉమామహేశ్వర ఆలయంలో భజన చేస్తున్న భక్తులు

కొత్తపల్లి: మండలంలోని సప్త నది సంగమేశ్వరంలో భక్తులు సందడి నెలకొంది. ప్రాచీన సంగమేశ్వరాలయం పూర్తిగా జలాదివాసం కావడంతో అక్కడ జలకళ సంతరించుకుంది. సోమవారం భక్తులు సుదూర ప్రాంతాల నుంచి సంగమేశ్వరం చేరుకొని కృష్ణా నది జలాలలో స్నానాలు ఆచరించి ఎగువన ఉన్న ఉమామహేశ్వరాలయంలో శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద గుమ్మడాపురం గ్రామానికి చెందిన భజన భక్త బృందం ఉమామహేశ్వర ఆలయంలో భజన చేశారు.

మల్లన్న సేవలో సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి



ఎన్వీ రమణ దంపతులకు స్వామి వారి జ్ఞాపకను అందజేస్తున్న ఈఓ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మ వార్లను సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. సోమవారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ దంపతులకు ఆలయ రాజగోపురం వద్ద దేవస్థానం ఈఓ ఎం.శ్రీనివాసరావు, ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వారు మల్లికార్జున స్వామి వారికి రుద్రాభిషేకం, భ్రమరాంబా దేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్దగల ఆశీర్వచన మండపంలో సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి దంపతులకు వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. దేవస్థాన ఈఓ స్వామి వారి శేషావస్త్రాలను, లడ్డూ ప్రసాదాలను, జ్ఞాపికను అందించి సత్కరించారు.

పొలం రస్తా సమస్యను పరిష్కరించాలి



నెహ్రూ నగర్ రైతులు ఇచ్చిన పొలం పట్టాదారు, దస్తావేజులు పరిశీలిస్తున్న తహసీల్దార్ శివరాముడు

పగిడ్యాల: పొలం రస్తా సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని నెహ్రూనగర్ గ్రామానికి చెందిన సోమ వెంకటేశ్వర్లు, వెంకటసుబ్బయ్య, రామచంద్రయ్య, గోపాలయ్య సోమవారం తహసీల్దార్ శివరాముడును కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. రీ సర్వేలో దాదాపు 0.28 ఎకరాలు తక్కువగా ఉన్నట్లు నివేదిక ఇచ్చారని, మరోసారి పరిశీలించి న్యాయం చేయాలని పాత ముచ్చుమర్రి గ్రామానికి చెందిన కాటం కృపరాజు అర్జీ అందజేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

పాములపాడు: భూములను కొలతలు వేయించి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐదుగురు రైతులు తహసీల్దార్ సుభద్రమ్మకు అర్జీలు అందజేశారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తుమ్మలూరు, బానుముక్కల, లింగాల గ్రామాల నుంచి ఒకటి చొప్పున జూటూరు గ్రామం నుంచి 2 అర్జీలు రైతుల నుంచి వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని ఆమె తెలిపారు.

కొత్తపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 9 మంది రైతులు వినతులు అందజేశారు.

మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తాం



మాట్లాడుతున్న ఆసియామారూఫ్

ఆత్మకూరు: మున్సిపాలిటీని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్ అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణంలోని వివిధ కాలనీల్లో ఇప్పటికే లక్షలాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. నూతన రింగు రోడ్డు ఏర్పాటుతో పాటు పట్టణ శివారులోని అన్ని కాలనీల్లో రహదారులు, డ్రెయినేజీలను ఏర్పాటు చేస్తామన్నారు. పాత బస్టాండు నుంచి కప్పలకుంట్ల వరకు డ్రెయినేజీ నిర్మాణానికి రూ.22 లక్షలతో, సీసీ రోడ్లకు రూ.1.20 లక్షలో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. అనంతరం తీర్మానాలను కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, కో ఆప్షన్ సభ్యులు రషీద్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ కోటేశ్వరి

ఆత్మకూరు: నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ కోటేశ్వరి తెలిపారు. సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మహానంది మండలం పుట్టుపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు(ఓసీ రిజర్వ్ మహిళ)తోపాటు ఐదు ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. కరివేన అంగన్‌వాడీ కేంద్రం -5లో బీసీ-సీ, వెలుగోడు మండలం రేగడగూడూరు-3వ అంగన్‌వాడీ కేంద్రంలో ఓసీ, మహానంది మండలం బుక్కాపురం-1వ కేంద్రం ఎస్సీ, సీతారామాపురం-2వ కేంద్రం ఓసీ, శ్రీశైలం -2వ కేంద్రం బీసీ-సీకి కేటాయించినట్లు చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణులై, 21 ఏళ్లు నిండిన మహిళలు అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీ జనవాస ప్రాంతాల్లో 21 ఏళ్ల మహిళలు లేకపోతే 18 ఏళ్లు నిండిన వారికి అవకాశం ఉంటుందన్నారు. జూలై 1 నుంచి 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.